క్లుప్తంగా

మొబైల్ బుక్ కీపింగ్ పై అవగాహన



కొల్లిపర: స్వయం సహాయ సంఘాలకు చెందిన ఎటువంటి లావాదేవీలు ఇక నుండి మొబైల్ బుక్ కీపింగ్ యాప్ ద్వారా ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని ఐబీ డీపీఎం బీ.కామేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాలకు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదు గ్రామ సంఘాలు ప్రభుత్వం ఎంపిక చేసి పైలెట్ గా ఈ యాప్ ను ఆయా గ్రామాలలోనే స్వయం సహాయ సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాప్ ద్వారా స్వయం సహాయ సంఘాలు జరుపుతున్న లావాదేవీలు ఎప్పటికప్పుడు ఏ విధంగా పరిశీలించాలి అన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి.రమాదేవి, సీసీలు టి.మధు, పూర్ణయ్య నాగుల్ ఖాన్, వెంకటరత్నం, వివో ఎస్.సుధారాణి, స్రవంతి, బసమ్మ, సునీత, స్వాతి, ధర్మతేజ, స్వర్ణభారతి, శ్రీ సాయి, శ్రీ రేణుకా దేవి, శ్రీ రామలింగేశ్వర గ్రామ సంఘాలు పాల్గొన్నారు.

దాతల వితరణ అందిపుచ్చుకోవాలి



కొల్లిపర: దాతల వితరణ అందిపుచ్చుకోవాలని మున్నంగి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.లక్ష్మీ కమల, ఎం ధనలక్ష్మీ అన్నారు. దుగ్గిరాలకి చెందిన చుందూరు భాస్కరరావు మున్నంగిలోని రెగ్యులర్, ఎల్. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యాభిషేక సామగ్రి అందజేశారు. భాస్కరరావు దాతృత్వాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. షేక్ వహీదా, వెంకాయమ్మ, సత్తార్ తదితరులున్నారు.

పాస్టర్లకు బియ్యం పంపిణీ



తెనాలిటౌన్: ఆర్ఈఐ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సేవకులకు బియ్యం పంపిణీ నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని గద్దం థామస్ ప్రాంగణంలో జోషయ, జాషువా జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 150 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి పది కేజీల చొప్పున బియ్యం బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో షారోన్, నతానియేల్, పాస్టర్లు రావూరి విక్టర్‌పాల్, మల్లవరపు విజయ్‌కుమార్, గద్దం జాన్‌బాబు, సువర్ణరాజు, షాలేమ్, ఐజాక్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా సుధీర్‌బాబు



తెనాలిటౌన్: మండల వ్యవసాయాధికారిగా కల్లగుంట సుధీర్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని వ్యవసాయ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా మార్టూరు నియోజకవర్గం కారంచేడు మండలం నుండి బదిలీపై తెనాలి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన జి.ప్రేమ్‌సాగర్ బదిలీపై వేమూరు మండలం వెళ్లారు. ఈ సందర్భంగా ఏవో సుధీర్‌బాబు మాట్లాడుతూ మండల పరిధిలో వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రైతులను సమన్వయం చేసుకుని రైతు సేవలు ముందుకు వెళ్తామని తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఈవోలు మోహన్, బ్రహ్మం, మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: పట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు పట్టణంలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు వివిధ కేంద్రాల్లో నిరాటంకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, నూతన ప్లే గ్రౌండ్స్, సచివాలయ కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా యోగా శిబిరాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.

• రహదారికి కోత



తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డు కోతకు గురవుతోంది. బుర్రిపాలెం సెంటరు నుంచి తెనాలి వైపు వెళ్లే మార్గంలో ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు కోతకు గురవుతోంది. గతంలో రోడ్డు వెంబడి ఉన్న వృక్షాన్ని తొలగించడంతో మొద్దు, వేర్లు పక్కన ఉన్న కాల్వలోకి ఒరిగిపోవడంతో రోడ్డు కోతకు గురవుతోంది. భారీ వర్షాలు కురిసి నీరు చేరితే రోడ్డు మరింతగా కోతకు గురై ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. –తెనాలిరూరల్

ప్రాంగణ ఎంపికలో ప్రియదర్శిని విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులతో కళాశాల ప్రెసిడెంట్ అమరేశ్వరరావు

తెనాలిటౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రెసిడెంట్ బొల్లిముంత అమరేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కళాశాల డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 22 మంది ఉద్యోగాలను పొందినట్లు తెలియజేశారు.

కళాశాల ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు ప్రాంగణ ఎంపికల్లో మంచి ఉద్యోగాలు పొందుతున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా కళాశాల పురోభివృద్ధి సాధిస్తునట్లు చెప్పారు. ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, కంప్యూటర్ హెచ్‌వోడీ వేదాంతం, శ్రీ సుధ, కామర్స్ హెచ్‌వోడీ బి.వెంకట సుబ్బారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యా శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

తెనాలిరూరల్: 'పాఠ్య పుస్తకాలు లేకుండానే చదువులు' పేరిట సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యా శాఖ అధికారులు స్పందించారు. పాఠ్య పుస్తకాలు విద్యా కానుక కిట్లు లేకుండానే తరగతులు నిర్వహించిన వైనాన్ని కథనంలో వివరించగా అందుకు అధికారులు వివరణ ఇచ్చారు. జిల్లాలో 93464 మంది విద్యార్థులకుగాను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లను అందించనున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, డిక్షనరీలు 10 మండలాల స్టాక్ పాయింట్లకు పంపిచామన్నారు. మరో ఎనిమిది మండలాలకు యూనిఫాంతో పాటు షూ, సాక్సులు, యూనిఫాం రెండు రోజుల్లో అన్ని పాఠశాలలకు అందించి, పూర్తి కిట్లను విద్యార్థులకు రెండు మూడు రోజుల్లో అందిస్తామని చెప్పారు.

రేపు సంగీత విద్వాంసుడు మోదుమూడికి పురస్కారం



మోదుమూడి సుధాకర్

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో 'గాన విదుషి' గద్దె వెంకట రామకుమారి స్మారకార్థం నిర్వహిస్తున్న సంగీత ఉత్సవం ఈ నెల 15వ తేదీన రామకుమారి దశమ వర్ధంతి శాస్త్రీయ సంగీత సభను జరపనున్నారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గద్దె వెంకట రామకుమారి స్మారక సంగీత పురస్కారాన్ని ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్‌కు బహూకరించనున్నారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎస్ ప్రభాకర్, విశిష్ట అతిథిగా పద్మశ్రీ అవార్డుగ్రహీత అన్నవరపు రామస్వామి పాల్గొంటారు. సభానంతరం సంగీత సభను నిర్వహిస్తారు. మోదుమూడి సుధాకర్ గాత్రానికి హేమాద్రి చంద్రకాంత్ వయొలిన్‌పై, కె.సద్గురు చరణ్ మృదంగంపై వాయిద్య సహకారం అందిస్తారు.

సద్గురు శ్రీత్యాగరాజ పరంపరలో 4వ తరానికి చెందిన గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంశస్తుడు మోదుమూడి సుధాకర్. విజయవాడలో జన్మించారు. గద్దె వెంకట రామకుమారి వద్ద ప్రారంభ శిక్షణ తీసుకున్నారు. 'నాదసుధార్ణవ' అన్నవరపు రామస్వామి శిష్యరికంలో ఉన్నత శిక్షణ పొందారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో బీకాం చదివారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో గ్రేడ్-1 సంగీత నిర్దేశకుడిగా 32 ఏళ్లు పనిచేశారు. కర్ణాటక గాత్ర సంగీతంలో సీనియర్ టాప్‌గ్రేడ్ విద్వాంసుడుగా గుర్తింపును పొందారు. 1989లో కేంద్ర ప్రభుత్వం వారి దక్షిణమధ్య ప్రాంత సాంస్కృతిక కేంద్రం జాతీయస్థాయిలో నిర్వహించిన 'యువ సంగీత నృత్య నృత్య మహోత్సవ్' పోటీల్లో గ్వాలియర్, నాగపూర్‌లో ప్రథమ బహుమతిని అందుకున్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో అయిదు వేలకు పైగా సంగీత ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో రెండుసార్లు పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విజయవాడలో 'స్వరఝరి' అనే సంస్థను స్థాపించి 37 ఏళ్లుగా ప్రతినెలా సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తుండటం మరో విశేషం! 1996లో విజయవాడలో 'గాయక సార్వభౌమ సంగీత పరిషత్'ను ఆరంభించి, ఏటా పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నారు. విజయవాడలోనే 'సంగీత సన్మండలి' (త్యాగరాజ ఆరాధన కమిటీ) అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలుగా సంగీత సేవ చేస్తున్నారు. వెయ్యికి పైగా లలిత, భక్తిగీతాలకు స్వరరచన చేశారు. 'ఆకాశవాణి సంగీత సమ్మేళన్' కార్యక్రమాన్ని బెంగళూరులోనూ, 'ఆకాశవాణి లలిత సంగీత సమ్మేళన్'ను కేరళలోని త్రిచూర్‌లోనూ సమర్పించారు.

2017లో రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారం, 2018లో కళారత్న పురస్కారాన్ని అందుకున్నారు. కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసునిగా సత్కారం పొందారు. త్యాగయ్య టీవీ (చెన్నై)చే 2019లో 'సంగీత విద్వన్మణి' బిరుదును స్వీకరించారు. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలను గానం చేసి సీడీని వెలువరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత విభాగంలో గౌరవ సలహా సభ్యుడిగా కొనసాగుతున్నారు. సుధాకర్ రచించిన సంగీత వ్యాసాల సంకలన గ్రంథం 'సుధాతరంగం' విశేషంగా సంగీత ప్రియుల మన్ననలను అందుకుంది. అమెరికాలోని డాలస్ నగరంలో 'సుస్వర మ్యూజిక్ అకాడమీ' 2016లో వీరిని 'సుస్వర సుధాగాన ప్రపూర్ణ' బిరుదుతో సత్కరించింది. విజయత్యాగరాజ సంగీత సభ, విశాఖపట్నం, దండమూరి రామమోహనరావు లయవేదిక, విజయవాడ, విశాఖ మ్యూజిక్ అకాడమీ పురస్కారాలను స్వీకరించారు. దేశవిదేశాల్లో వీరికి అసంఖ్యాకంగా శిష్యులు ఉన్నారు. 2023 జూలై 23న విజయవాడలో వీరి శిష్యులు పల్లకీలో ఊరేగించి, సువర్ణ ఘంటాకంకణంతో ఘనంగా సత్కరించారు. గతేడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలోనూ సత్కారాన్ని అందుకున్నారు.

పర్సు దొరికితే పోలీసులకు అప్పజెప్పిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



ఎస్ఐ ప్రకాశరావుకు పర్సును అందజేస్తున్న తరుణ్, హోంగార్డు సింగ్

తెనాలిరూరల్: రోడ్డుపై పడి ఉన్న పర్సును సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోలీసులకు అప్పగించాడు. మండలంలోని చావావారిపాలెంకు చెందిన చిక్కాల తరుణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల వర్క్ ఫ్రం హోం కింద స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై తెనాలి వచ్చిన అతను రైల్వే స్టేషన్ రోడ్డులోని పెట్రోలు బంకులో పెట్రోల్ కొట్టించుకుని దాని ఎదురు రోడ్డులోకి వెళ్లగా రోడ్డుపై పర్సు పడి ఉండడాన్ని గమనించాడు. పర్సులో నగదు, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు ఉంది. చుట్టపక్కల వాళ్లను వాకబు చేసిన ఎవరి పర్సు పోలేదని చెప్పగా, వెంటనే సమాచారాన్ని తెనాలి ట్రాఫిక్ విభాగంతో హోంగార్డుగా పని చేస్తున్న తన తండ్రి సింగ్‌కు తెలిపాడు. ఆయన సూచన మేరకు ఇరువురూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ నక్కా ప్రకాశరావుకు పర్సును అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన తరుణ్‌ను ఎస్ఐ, త్రీ టౌన్ సిబ్బంది అభినందించారు.

చెస్ కోచ్ నిరంజన్ సేవలు అభినందనీయం



తెనాలిటౌన్: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ ఎం.నిరంజన్ సేవలు అభినందనీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మారీసుపేటలోని చెస్ అకాడమి కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లేయర్, కోచ్ ఎం.నిరంజన్‌ను ఘనంగా సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు పాల్గొని దుశ్శాలువా, మెమొంట్‌తో సత్కరించి అభినందనలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా అనేక మంది విద్యార్థులకు చెస్ కోచింగ్ ఇవ్వడమేకాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారు రాణించేలా కృషి చేసిన నిరంజన్ సేవలను ప్రసంశించారు. కార్యక్రమంలో చావాలి అకుల్‌నాథ్, చావాలి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

తెనాలి: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల విద్యార్థులు, ఉద్యోగులు ప్రధాన సమస్యలను పరిష్కరించాలంటూ, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలోని బృందం శుక్రవారం సీఎం కార్యాలయ కార్యదర్శికి విజ్ఞాపన అందించారు. అనంతరం విడుదల చేసిన ప్రకటనలో, బీసీ హాస్టళ్ల విద్యార్థుల కోసం కేటాయిస్తున్న డైట్-కాస్మోటిక్ చార్జీలు పక్క రాష్ట్రాలతో గాని, మార్కెట్ ధరలతో పోల్చితే చాలా తక్కువగా ఉన్నాయన్నారు. దీని వల్ల హాస్టళ్ల విద్యార్థులు-ఉద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హాస్టళ్ల సంక్షేమాధికారులపై ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ కేసులను సత్వరమే ఆరు నెలల లోపల పరిష్కరించాలన్నారు.

నేడు 20 గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కొల్లిపర సబ్ స్టేషన్, మున్నంగి సబ్ స్టేషన్, అన్నవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం 20 గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: తెనాలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ ఆశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ల మరమ్మతులు, అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు పనులు జరుగుతున్న కారణంగా తెనాలి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సూచించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

తెనాలిటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నేడు ఉదయం 9 గంటలకు స్థానిక చెంచుపేటలోని గవర్నమెంట్ హాస్పటల్ బ్లడ్ బ్యాంక్ నందు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తన్నీరు శివశంకర్ తెలియజేశారు. రక్తదాతలు శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ఆపదలోని వ్యక్తికి ప్రాణదానంతో సమానమని వెల్లడించారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ జి.రాధాభాయ్ శిబిరంలో సేవలందిస్తారని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిటౌన్: పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు ఇన్‌ఛార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. శుక్రవారం పట్టణ కొత్తపేట, గంగానమ్మపేటలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కొత్తపేటలో శానిటేషన్ సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం వార్డులో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కాల్వల్లో షీల్ట్ తీయడం వేగవంతం చేయాలని ఎక్కడ అపరిశుభ్రత కనపడకూడదని సూచించారు. అనంతరం గంగానమ్మపేటలో పర్యటించి తడి చెత్త పొడి చెత్త సేకరణను పరిశీలించారు. గృహిణులు రోడ్లపై చెత్త చెదారం వేయవద్దని ముఖ్యంగా కాల్వల్లో వ్యర్థాలు పడవేయవద్దని సూచించారు. చెత్త సేకరణకు ఇంటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త ఇవ్వాలని కోరారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో సామాన్యుడికి ఆర్థిక భారం

సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాబుప్రసాద్

తెనాలిటౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడంతో సామాన్యులకు ఆర్థిక షాక్ తగులుతుందని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదల ఇళ్ళకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ప్రజలపై మోపుతున్న ఇంటి పన్నుల భారాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ పాల్గొని ప్రజలకు కరపత్రాలు అందజేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు భవిష్యత్‌లో మనపాలిట శాపాలుగా మారుతాయని ఆరోపించారు. ఉపాధి లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగిస్తుందని మండిపడ్డారు. కష్టాల నుంచి ప్రజలను గట్టెంకిచాల్సిన ప్రభుత్వం ఆస్తి ఆధారిత పన్ను వసూలు చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. రాజకీయ విలువలు పాటించకపోతే రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురి కాకతప్పదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉమేష్, పక్కన ఎస్ఐ ఆనంద్

తెనాలిరూరల్: గుంటూరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ ఆర్. ఉమేష్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ఐతానగర్‌కు చెందిన సుకుమార్ మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కురగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణిసింహారెడ్డి స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బుల కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. గుంటూరు కొత్తపేటకు చెందిన వృద్ధుడు రత్తయ్య వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చి పొట్లాలు కట్టి విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయాలపై సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐలు ఆనంద్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ చెంగలరాయుడు, కానిస్టేబుళ్లు డి. రవి, సుబ్బారెడ్డి నందివెలుగు ప్రధాన కూడలిలో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై సాంబిరెడ్డి, చైతన్య, మణిసింహారెడ్డి ట్రిపుల్ రైడింగ్ చేస్తూ కనబడ్డారు. వారి వాహనాన్ని తనిఖీ చేయగా 1400 గ్రాముల గంజాయి లభించింది. సుకుమార్‌కు చెందిన బైక్‌లో స్నేహితులందరూ గుంటూరు వెళ్లగా తనకు వేరే పని ఉంది తర్వాత వస్తానంటూ సుకుమార్ అక్కడే ఆగిపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా రత్తయ్య నుంచి తరచూ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. సుకుమార్, రత్తయ్య పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దేవస్థానం చైర్మన్ రమేష్

తెనాలిటౌన్: స్థానిక శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ప్రతినెలా 2వ శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు గుమ్మడి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో కందేపి సీతారామయ్య, యర్రా శ్రీనివాసరావు, నక్కా వెంకటేశ్వర్లు, గవిని దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం మరిచారా.. విడిచారా!



మంగళగిరి టౌన్: వారం రోజులుగా ఒకే చోట ఉన్న వాహనం స్థానికుల్లో కలకలం రేపుతోంది. ఆ ద్విచక్రవాహనం ఎవరిది.. ఎవరు పార్క్ చేశారో తెలియడం లేదు. కానీ వారం రోజులుగా తాడేపల్లి క్రిస్టియన్ పేట చర్చికి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంది. వాహనం ఏపీ07ఈఎఫ్5395 నంబరు గల ఆ వాహనం వారం రోజులుగా అక్కడే ఉండడంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ వాహనాన్ని ఇక్కడ మరిచారా.. లేక విడిచి వెళ్లారా.. లేదా ఏదైనా నేరం చేసి ఇక్కడ వదిలి వెళ్లారా అని స్థానికుల్లో చర్చనీయాంశం అయ్యింది.

'సార్క్' ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన యువతికి సాయం



ఆర్థికసాయం చెక్కును అందిస్తున్న డీఎల్ కాంతారావు

తెనాలి: నేపాల్ రాజధాని ఖాట్మండులో గల 'సార్క్' సెక్రటేరియట్‌లో రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన తెనాలికి చెందిన ఐఐటీ, మద్రాస్ విద్యార్థిని పి.స్నేహితకు స్థానిక 'పోస్ట్' ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. ఇక్కడి కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు చేతులమీదుగా స్నేహిత తండ్రి నరసింహా రావుకు చెక్కును అందజేశారు. విద్య, ఉపాధి, మహిళా సాధికారత, వైద్యసేవలు, వృద్ధాశ్రమం, గోశాల నిర్వహణలో రెండు దశాబ్దాలుగా పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ కృషిచేస్తోంది. స్థానిక హెడ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న పి.నరసింహారావు కుమార్తె స్నేహిత ఐఐటీ, మద్రాస్‌లో ఎంఏ డెవలప్‌మెంట్‌లో నాలుగో ఏడాది చదువుతోంది. ఆమెకు 'సార్క్' సెక్రటేరియట్‌లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 30 మందిలో స్నేహిత ఒకరు. సార్క్ నుంచి ఎలాంటి స్టైఫండ్ వచ్చే అవకాశం లేనందున కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావును సంప్రదించారు. ఆయన స్పందించి రూ.లక్షను 'పోస్ట్' ట్రస్ట్ ఖాతాకు రూ.లక్షను జమచేశారు. ఆ మొత్తానికి చెక్కును పోస్ట్ ట్రస్ట్ తరపున స్నేహిత తండ్రి నరసింహారావుకు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిటౌన్: మండల పరిషత్ ఉద్యోగుల సేవార్థం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పటల్ తెనాలి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, విద్యాశాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయ పరిధిలోని ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్ని వైద్య సేవలు పొందారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులు సేవార్థం అగర్వాల్స్ ఐ హాస్పటల్ యాజమాన్యం వైద్య శిబిరం నిర్వహించడం ముదావహమని సేవలను కొనియాడారు. ఉద్యోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి ఎస్‌కె నాగూర్‌వలి, ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.